# ఆదర్శ ప్రభువు

**ది**బ్బరాజ్య పూర్వచరిత్ర గురించి నేను పరిశోధనలు చేస్తున్నట్టు తెలిసిన మిత్రులు కొందరు నన్ను ఒక పెద్దమనిషిని కలుసుకోమని సలహా ఇచ్చారు. ఆయనకు తెలిసిన దిబ్బ చరిత్ర ప్రపంచంలో మరెవరికీ తెలియదని విన్నాను. కాని ఆయన ఆ చరిత్రను ప్రపంచానికి ఎందుకు అందజేయలేదో నాకర్థం కాలేదు.

నేను వీలు చేసుకుని ఆ పెద్ద మనిషి దగ్గిరికి వెళ్ళాను. (ఈ మనిషి పేరు నేనిక్కడ బయటపెట్టక పోవటానికి కారణం ఆయన అలా కోరి వుండటమే). ఆయన చూడటానికే ఎనిమిదో శతాబ్దపు శాసనం రేకులాగా ఉన్నాడు. ఆయన ఇల్లు తాళపత్ర గ్రంథాల వాసన. దీనికి కారణం ఇంటినిండా తాళపత్ర గ్రంథాలే.

ఆయనకు నన్ను నేను ఎరుకపరచుకున్న తరవాత "తమకు దిబ్బచరిత్ర అమూలాగ్రం తెలుసునని విన్నాను. అది గ్రంథరూపంలో ఎందుకు ప్రచురించారు కాదు?" అని నేనాయన నడిగాను.

గదినిండా తొక్కితే ఊరే తాళపత్ర గ్రంథాలు చూపి "ఇదంతా దిబ్బచరిత్రే. 67 తరాలుగా మా వాళ్ళు తమకు తెలిసిన చరిత్ర యావత్తూ రాసిపెట్టారు. నేను ప్రభువుగారు కోరగా 'సంగ్రహ దిబ్బ చరిత్ర' అని 850 పేజీలుగల గ్రంథం ఒకటి రాశాను. 500 కాపీలు అచ్చు వేయించాను. 5 కాపీలు చెల్లాయి. మిగిలిన వాటిని దూదిలో పెట్టి దిళ్ళు కుట్టించి అమ్మించాను" అన్నాడాయన.

"అంటే 13, 14 శతాబ్దాలుగా రాసిన తాళపత్ర గ్రంథాలన్నీ తమ దగ్గిర ఇంకా వున్నాయా?" అన్నాను.

ఆయన నవ్వి "లేదు. మా ముత్తాతగారి తాతగారు అనేక పాత గ్రంథాలు శిథిలమై పోతూంటే వాటిని తిరగరాశారు. ఈ తాళపత్ర గ్రంథాలలో 150 ఏళ్ళు మించిన వయసు గలది ఏదీలేదు. తిరగ రాసేటప్పుడు తొలి గ్రంథాలలో వుండిన భాషను కొన్ని కొన్ని చోట్ల మార్చవలసి వచ్చింది కూడా. క్రీస్తుశకం పన్నెండవ శతాబ్దం దాకా 'దిబ్బ' అనేమాట వాడుకలోకి రాలేదు. తిప్ప శబ్దమే వాడుక జరిగింది. తిప్పలు అనే నిత్యబహువచన ప్రయోగం తిప్ప శబ్దం నుంచే వచ్చిందని మా తాతగారు చెప్పగా నా చిన్నతనంలో విన్నాను" అన్నాడాయన.

“చరిత్ర ప్రకారం దిబ్బరాజ్యం స్థాపించిన దెవరు?” అన్నాను.

“దాని విషయంలో ఎట్టి సందేహమూ లేదు. శ్రీమన్మహారాజ వరాహ నారసింహ తిప్పలుంగారు దిబ్బరాజ్య వ్యవస్థాపకులు. సాక్షాద్విష్ణ్వంశ సంభూతుడైన ఆయనను ఆయన తల్లి మూడు సంవత్సరాలు గర్భాన ధరించి కన్నది. అందుచేతనే ఆయన తండ్రి గతించిన రెండున్నర సంవత్సరాలకు జన్మించాడు. అణిమాది సిద్ధులుగల ఒక కోయరాజు అదృశ్య రూపంలో ఒకనాడు వరహ నరసింహదేవుడి తల్లి నిద్రించే మంచం మీద పడుకున్నాడట. మహాపతివ్రతా శిరోమణి అయిన ఆమెను అంటటం వాడితరం కాకపోయింది. అందుచేత మంచం మీద వాడికీ ఆమెకూ మధ్య ఒక అంగుళం మేర వాయుదేవుడు గోడగా స్తంభించి నిలబడ్డాడట. ఇంతలో ఆమె తండ్రి అక్కడికి వచ్చి; తన తపశ్శక్తిచేత అదృశ్యరూపంలో వున్న కోయరాజును చూసి శాపోదకం చేతబట్టేసరికి ఆ కోయరాజు ఆయన కాళ్ళపైబడి క్షమాపణ వేడి తన దారిన తాను వెళ్ళాడట. ఇది జరిగినట్టు తెలుసుకోగానే ఆ పతివ్రతా శిరోమణి తన గర్భస్థ శిశువును బయటికి రమ్మని ప్రార్థించిందట. అప్పటికే రెండు సంవత్సరాలకు పైగా గర్భనరకం అనుభవిస్తున్న శిశువు మూడేళ్ళు నిండగానే బయటపడ్డాడట” అన్నాడాయన.

“ఇది సమకాలికులు రాసిన విషయమే!” అన్నాను ఆశ్చర్యంతో.

“అవును. ఇది రాసిన మా పూర్వీకుడు వరాహ నారసింహ తిప్పకంటే రెండేళ్ళు పెద్దవాడు. మా తాత ముత్తాతగారు తిరగ రాసేటప్పుడు ఏళ్ళ సంఖ్యల్లో ఏమన్నా పొరపాటు పడ్డారా అని అనుమానం తగిలింది నాక్కూడా”

“తిప్పగారిని తల్లి మూడేళ్ళు మోయటం గురించేనా?”

“అది ఒక్కటే కాదు. ఇంకా ఇతర తభావతులు కొన్ని వున్నాయి. మొదటి తిప్పకు పెళ్ళినాటికి నాలుగేళ్ళ వయసుండేటట్టుగా సంవత్సరాల పేర్లివ్వబడ్డాయి. రక్తాక్షిలో ఆయన పుట్టాడు. ప్రభవలో ఆయనకు పెళ్ళి అయింది. పెళ్ళినాటికి ఆయనకు 64 ఏళ్ళనుకుందామా అంటే ఆయన అక్షయలో చనిపోయాడు. చనిపోయేటప్పటికి ఆయన వయసు 63 అనుకోవాలా? 123 అనుకోవాలా? ఇదొక ధర్మసందేహం. మరొక ధర్మ సందేహమేమంటే, పెళ్ళినాటికి ఆయన భార్య వయసు 28 ఏళ్ళులాగా కనిపిస్తుంది. నాలుగేళ్ళ వాణ్ణి 28 ఏళ్ళదాని కిచ్చారా? 28 ఏళ్ళదాకా ఆవిడకెందుకు పెళ్ళికాలేదు? ఇలాటి సందేహాలున్నాయి. వీటన్నిటికన్న గొప్ప సందేహమేమంటే ఆమెకు వివాహమైన మూడేళ్ళకే శుక్లలో ఆమెకు తొలి సంతానం కలిగింది. అప్పటికి తిప్ప ఏడేళ్ళవాడై వుండాలి. లేదా 67 ఏళ్ళవాడై వుండాలి. 67 ఏళ్ళవాడనుకుందామంటే, తిప్ప భార్య 15వ ఏట 18వ కుమారుణ్ణి కన్నది. అప్పటికి తిప్ప 94 ఏళ్ళవాడై ఉండాలి.”

"ఆనాటి వాళ్ళ జవసత్వాలు మనం ఇవాళ ఊహించలేం" అన్నాను.

"నేనూ అదే అనుకున్నాను. కాని ఆమె పోయాక తిప్ప పదహారేళ్ళదాన్ని చేసుకుని తాను చచ్చినదాకా పిల్లల్ని కంటూనే వున్నాడు. అంటే తిప్ప 123 ఏళ్ళు బతకటమే గాక చివరదాకా పిల్లల్ని కంటూనే ఉన్నాడన్నమాట."

"మీరన్నట్టు మీతాతగారి ముత్తాతగారు పొరబడి సంవత్సరాలు తప్పు రాశారేమో?"

"ఆయన గొప్ప జ్యోతిషగ్రంథం రాయకపోతే ఆ మాట అనుకొనాలిసిందే. తాళ పత్రంలో ఏదైనా తప్పులుంటే అవి మొదటి పత్రంలోనే అయి ఉండాలి. తిరగరాసినప్పుడు దొర్లినవని నాకు తోచదు."

"అదే అయి ఉండవచ్చు."

"కాని తొలి గ్రంథంలో ఈ సంవత్సరాల పేర్లు తప్పిస్తే అనుమానాస్పదంగా కనిపించేది మరేదీ కనబడదు. ఎందుచేతనంటే తిప్ప మహారాజు అవక్ర పరాక్రమ చరిత్ర యావత్తూ గ్రంథంలో అత్యద్భుతంగా వివరించి ఉన్నది."

"ఆ చరిత్ర నాకు సంగ్రహంగా సెలవివ్వగలరా?" అన్నాను.

"తిప్పకు మొదటి సంతానం - కుమార్తె - కలిగిన మరుసటి ఏడే ఒక వింతకల వచ్చింది. ఆ కలలో ఆయనకు తండ్రి ప్రత్యక్షమై, 'నాయనా, నీవు తూర్పు దిక్కుకు ఒంటరిగా ప్రయాణమై వెళితే అరణ్యంలో పరమేశ్వరుడు నీకు కోయదొర రూపంలో ప్రత్యక్షమవుతాడు. అతని సహాయంతో నువ్వు సమస్త దేశాలు జయించి చక్రవర్తివవుతావు' అని చెప్పాడట. ఈ కల వచ్చేనాటికి తిప్ప ఎనిమిదేళ్ళవాడు కావాలి, లేదా 68 ఏళ్ళవాడు కావాలి. నిద్రలేస్తూనే అతను తల్లివద్దకు పోయి ఆమె కాళ్ళకు నమస్కరించి 'అమ్మా, చక్రవర్తి కమ్మని ఆశీర్వదించు!' అని అడిగాట్ట. తల్లి అతన్ని ఎత్తి ముద్దాడి, అలాగే ఆశీర్వదించిందట. 68 ఏళ్ళవాణ్ణి తల్లి ఎత్తి ముద్దాడటం దురూహ్యం. అది పోనివ్వండి."

"ఇంతకూ ఆ కల నిజమయింది. కోయదొర తిప్పకు గొప్పగా స్వాగతమిచ్చి, అతను వచ్చిన పని తెలుసుకుని, 'నాయనా, నా కుమారుడి వంటివాడవు. నీకు కావలసినంత రాజ్యం నేను గెలిచి పెడతాను' అన్నాడట. అడివిలో వుండే కోయలూ, బోయలూ, చెంచులూ, కిరాతులూ కలిసి పశ్చిమ సముద్రం లాంటి సేనగా తయారై బయలుదేరి 20 యోజనాల నిడివిగల రాజ్యాన్ని సంపాదించి పెట్టారు. వారికి నాయకత్వం వహించిన కోయదొరను తిప్ప తన రాజ్యానికి సేనాపతిగా నియమించి మహావైభవంగా పట్టాభిషేకం చేసుకున్నాడు."

"ఈ విజయయాత్ర మూడేళ్ళు పట్టింది. ఈ సమయంలోనే తిప్ప రెండవ సంతానమైన చిన్న తిప్ప పుట్టాడు. ఆయన కూడా తండ్రిలాగే బహుదీర్ఘకాలం - రెండేళ్ళు - మాతృగర్భంలో వున్నాడు. తిప్ప అనంతరం సింహాసనం ఎక్కినవాడుకూడా ఈయనే."

"ఒక్క ఏడు విరామం, మళ్ళా యుద్ధం. ఇది ముగిసేసరికి దిబ్బరాజ్యం అయిదింతలుగా విస్తరించింది. వింధ్యకు దక్షిణాన దిబ్బకు సాటిరాజ్యం లేకుండా పోయిందంటే అతిశయోక్తి కాదు. దక్షిణ దండయాత్ర ముగిసేటప్పటికి నా అంచనా ప్రకారం తిప్పకు 18 ఏళ్ళు."

"తిప్పకు 19 నిండక పూర్వమే ఒక విషాద సంఘటన జరిగింది. తిప్ప తన సేనానాయకుడైన కోయ దొరను తన మిద్దెమీదికి పిలిపించి నౌకర్ల చేత దారుణంగా హత్య చేయించాడు. కోయదొర నిజానికి తిప్పకు రాజ్యం సంపాదించి పెట్టినవాడు. ఆ అహంకారంతో అతని కళ్ళు నెత్తికి వచ్చి స్వామిద్రోహం చెయ్య తలపెట్టాడేమో తెలియదు. తిప్ప తల్లీ, కోయదొరా కలిసి ఏదో కుట్ర చేసినట్టు తిప్పకు తెలిసిందని ఒక వదంతి పుట్టింది. కోయ ప్రజల పరిపాలన విషయంలో తిప్పకూ సేనానాయకుడికీ అభిప్రాయ భేదాలు వచ్చాయని మరొక వదంతి పుట్టింది."

"ఏమైనా కోయదొర హత్యమట్టుకు కొంత అల్లకల్లోలానికి దారి తీసింది. తిప్ప సైన్యంలోగల కోయలు తిరుగుబాటు చేశారు. వారందరికీ తిప్ప విందుచేసి విషం పెట్టి చంపాడు. అది మొదలుకుని తిప్ప అరణ్యాలు, తిప్పడొక్కలో శూలాలుగా పరిణమించాయి. వాళ్ళ బాధపడలేక తిప్ప తన రాజధానికి పది యోజనాలమేరలో ఎక్కడా అరణ్యమన్నది లేకుండా చేశాడు. ఎన్నో కార్చిచ్చులు కృత్రిమంగా అంటించబడ్డాయి."

"తిప్ప అవలంబించిన రాజ్యాంగ నీతి అతి విచిత్రమైనది. ఆయన పరిపాలనకు ఒక్క చిల్లిగవ్వ వెచ్చించలేదు. దివాణంలో ఎవరికీ ఎన్నడూ జీతాలు లేవు. పదవులు మాత్రమే వుండేవి. ఎవరి హోదాకు తగినట్టు వారు సంపాదించుకోవలసినదే. ఎవడన్నా తన హోదాకు తగినట్టు జీవించటం లేదని తెలిస్తే అసమర్థుడని వాణ్ణి పదవిలోనుంచి తొలగించేవాడు. ఈ అద్భుతమైన ఏర్పాటువల్ల రాజ్యాంగం కమానుబండిలాగా ఒడిదుడుకులు లేకుండా నడిచింది."

"తిప్ప తన సూక్ష్మబుద్ధిని మరొక విధంగా కూడా ప్రదర్శించాడు. 'పరధర్మో భయావహః' అని పెద్దలు చెప్పినప్పటికీ, సాధారణంగా మనుషులకు తమ ధర్మంమీదకన్నా పరధర్మం మీదనే ఆసక్తి హెచ్చని సిద్ధాంతీకరించాడు. మనుషులు స్వధర్మం ఆలోచించేటప్పుడు దాని లోతుపాతులు ఆలోచిస్తారు. పరధర్మం ఆచరించేటప్పుడు స్వబుద్ధి ఉపయోగించరు. అందుచేత తిప్ప తన ప్రధానామాత్యుడుగా ఒక వణిక్పుత్రుణ్ణి పెట్టుకున్నాడు. సామంతులను ఎవరి ప్రదేశంలో వారిని ఉండనివ్వలేదు. వేరు భాషలూ, వేరు జాతులూ గల చోట సామంతులను ఏర్పాటు చేశాడు. ఇలా చేయటం వల్ల దూరప్రాంతాల పరిపాలన సమర్థంగా సాగింది. ఎందుకంటే పాలకులకు ప్రజలపట్ల

సానుభూతులుండేవికావు. వేరు వేరు ప్రాంతాల రక్షకభటులను ఏర్పాటు చేసేటప్పుడు వారిని ఇతర ప్రాంతాలనుంచి తెచ్చి వేయించాడు."

"నాకు అష్టోత్తరశత రక్షణలున్నాయి" అని తిప్ప ఒకానొక సందర్భంలో ఒక అరబ్బీ యాత్రీకుడితో అన్నాడని ప్రతీతి. ఇలాటివే ఆ రక్షణలు."

"తిప్ప సామ్రాజ్య విస్తరణ ఒక విస్మయగాథ. తన 29వ ఏడు మొదలుకుని 41వ సంవత్సరం దాకా ఆయన వెర్రిగా యుద్ధాలు చేశాడు. ఈ పన్నెండేళ్ళ కాలంలో ఆయన నూటయాభై రాజ్యాలకు తక్కువలేకుండా తన రాజ్యంలో కలుపుకున్నాడు. ఈ యుద్ధాలలో తిప్ప మీద ఓడిపోయిన ఒకరాజు 'ఈ తిప్పకు యుద్ధశాస్త్రం ఏమీ తెలీదనుకోవాలో, లేక పూర్వం యుద్ధ శాస్త్రాలు రచించినవారందరికన్నా ఇతడు బుద్ధిశాలి అనుకోవాలో నాకు తెలియటంలేదు' అన్నాడు – ఈనాటికీ ఈ సందేహం సందేహంగానే ఉన్నది."

"ఎందుకంటే, తిప్ప వెయ్యిమంది సైనికులను పది వేలమంది సైనికుల మీదికి ఉసికొలిపి గెలిచిన సమయాలున్నాయి. ముగ్గురు సైనికులను పంపి ఒక కోట పట్టుకున్న నిదర్శనం ఉన్నది. అచ్చుగా ఆడ సైనికుల దళాన్ని ఉపయోగించి పెద్ద పెద్ద రాజ్యాలు గెలిచిన తరుణాలున్నాయి. మామూలుగా దిగ్విజయాలు సాగించిన వారెవ్వరూ ఎన్నడూ చేయని పనులు తిప్ప కొల్లలుగా చేశాడు. క్రియకు చెప్పుకోవలసిందేమిటంటే తిప్ప ఏ యుద్ధంలోనూ ఓడిపోలేదు. కనీసం అటువంటి పుకారు మాత్రం బాగా వ్యాపించింది. నామటుకు నేను తిప్ప చాలాచోట్ల పరాజితుడైనాడనుకుంటాను. కానీ అతను చేసినది యుద్ధమే కానప్పుడు ఓటమి జరిగిందోలేదో ఎవరు చెప్పగలరు? పదిమంది సైనికులు ఒక కోట పట్టుకోవటానికి పోతారు. వారు పట్టుకుంటే విజయం, పట్టుకోలేకపోతే మటుకు పరాజయం కాదు. తిప్పకు పరాజయం లేదనేది శత్రువులకొక మూఢ విశ్వాసమైపోయి ఎన్నోచోట్ల వాళ్ళు యుద్ధం చెయ్యకుండానే లొంగిపోయారు."

"ఈ యుద్ధాలలో తిప్ప గెలవదగినంత దేశం గెలిచి అకస్మాత్తుగా బౌద్ధమతం పుచ్చుకున్నాడు. బౌద్ధ సన్యాసులు వందలూ, వేలూ వచ్చి దిబ్బరాజ్యం మీద వాలారు. ప్రతి గ్రామంలోనూ వీళ్ళకోసం మఠాలూ, పాఠశాలలూ కట్టించబడ్డాయి. అహింసాతత్వం ఉద్ధరించబడింది. తన సామ్రాజ్యానికి భంగం రాకుండా ఉండటానికి ఈ పనిచేసానని తిప్ప తన అవసానకాలంలో ఒప్పుకున్నాడు."

"బౌద్ధమతావలంబనతో యుద్ధాలు ముగిశాయి. కాని సామ్రాజ్య విస్తరణ ముగియలేదు. తిప్ప బుద్ధిసూక్ష్మతకు ఇంతకంటె మంచి ఉదాహరణ కనబడదు. ఆయన తనకింద లేని చిన్న చిన్న రాజులవద్దకు రాయబారులను పంపి, 'మీరు స్వతంత్రంగా ఉండగోరుతారా? లేక నా రాజ్యంలో సామంతులుగా ఉండి రెండింతల ప్రాంతాన్ని

ఏలగోరుతారా?' అని అడిగించాడు. పది గ్రామాలకు స్వతంత్ర రాజులుగా ఉండటం మంచిదా, ఇరవై గ్రామాల మీద పెత్తనం చేయటం మంచిదా? ఎంతోమంది రాజులు సామంతులుగా ఉండటానికి ఒప్పుకున్నారు. అటువంటి వారికోసం పాత సామంతుల నెందరినో తిప్ప పదవీభ్రష్టులను చేశాడు. ఎవడైనా రాజు మొండికేసి తనకు సామంతుడు కావటానికి నిరాకరిస్తే వాడి రాజ్యం చుట్టూ ఉన్నవారికి పెద్ద ఆశలు పెట్టి వారిని తన సామంతులను చేసుకున్నాడు. ఇలాటి చక్రవ్యూహంలో చిక్కుకుపోయినవారు కాలక్రమాన తమ రాజ్యాలను తిప్ప పరం చెయ్యక తప్పిందికాదు."

తిప్పను గురించి వింటున్నకొద్దీ నాకు ఆశ్చర్యం కలిగింది. "ఈనాటి సామ్రాజ్యవాదులూ, పారిశ్రామికులూ, భూతవైద్యులూ, కరణాలూ చేసే యుక్తులన్నీ ఆనాడే తిప్ప అమలు చేశాడన్నమాట!" అన్నాను.

"నిజంగా ఆశ్చర్యపడవలసినది ఇదేదీ కాదు, వేరే ఉంది" అన్నాడాయన.

"ఏమిటది?" అన్నాను.

ఆయన, ఎవరన్నా వినిపోతారేమో నన్నట్టు, అటూ ఇటూ చూసి, రహస్యంగా, "తిప్ప ఆఖరు రోజుల్లో పిచ్చితో చచ్చిపోయాడు" అన్నాడు.

"అందులో వింత ఏమిటి?" అన్నాను.

"మా పూర్వీకుడి మేనత్త కొడుకు రాజవైద్యుడు, తిప్ప మొదటినుంచీ పిచ్చివాడేనని ఆయన మా పూర్వీకుడితో చెప్పాట్ట. ఆ విషయం మా తాళపత్ర గ్రంథంలో స్పష్టంగా రాసివుంది" అన్నాడాయన.

❋ ❋ ❋ ❋ ❋

పాతకోటకూ కొత్తకోటకూ మధ్య రెండుమైళ్ళ సూటి రోడ్డున్నది. ఇది తూర్పు పడమరలుగా ఉన్నది. పాత కోటనుంచి పడమరగా వస్తుంటే, కొత్తకోట మూడు ఫర్లాంగులుందనగా, గెస్టుహౌసునుంచి మ్యూజియం వెళ్ళే ఉత్తర దక్షిణాల అడ్డరోడ్డు తగులుతుంది. ఈ రెండు రోడ్లు కలిసే చోట పది అడుగుల ఎత్తుగల రాతి బొమ్మ మీద ఉండే అయిదడుగుల కంచుపోత విగ్రహం దీనబాంధవకోటిరాయలది.

అమెరికాకు రాక్‌ఫెల్లర్ ఎటువంటివాడో, ఇండియాకు జంషెడ్జీతాతా యెటువంటివాడో, దిబ్బకు కోటరాయలు అటువంటివాడు. దిబ్బరాజ్యంలో పారిశ్రామిక యుగానికి ఈయనే శంకుస్థాపన చేశాడు. 1876లో ఈయన దిబ్బనగరంలో మొట్టమొదటి ఫాక్టరీ కట్టాడు. క్రమంగా ఈయన చేతిమీదుగా 12 రకాల పరిశ్రమలు ఏర్పడ్డాయి. ఈయన దిబ్బకు చేసిన సేవను గుర్తించి, గతించిన మహారాజావారు ఈయనకు దీనబాంధవ బిరుదునిచ్చాడు.

కోటిరాయలు దివాణంలో ఒక చిన్న ఉద్యోగి కొడుకు. అట్టే చదువుకున్న వాడుకాదు. ఒక మిషనరీ దొరతో కలిగిన పరిచయం ద్వారా ఆయనకు పరిశ్రమల ప్రాముఖ్యం తెలిసివచ్చింది. వెంటనే ఇంగ్లండు వెళ్ళి కొన్ని ఫాక్టరీల్లో కూలి చేసి పనితనం సంపాదించాడు. తరువాత స్వదేశానికి తిరిగివచ్చి, దిబ్బలో ఒక ఫాక్టరీ నిర్మించటానికి మహారాజావారి అనుమతి వేడాడు. మహారాజావారు నిరాకరించారు.

"మన ఆర్యనాగరికతకూ ఫాక్టరీలకూ పొత్తు కుదరదు. నా బొందిలో ఊపిరుండగా దిబ్బలో యంత్రాల మోత వినిపించటానికి వీలులేదు" అన్నారు మహారాజావారు.

"యంత్రాలు ఆర్య నాగరికతకు వ్యతిరేకమైనవి కావు. పూర్వకాలంలో మనకు యంత్రాలుండేవి. మనం మన పరిశ్రమలను ఆర్యధర్మం ప్రకారం తప్పకుండా నడుపుదాం" అన్నాడు కోటిరాయలు.

రోజుల తరబడి చర్చించుకున్నారు. చివరకు ఎంతో విచారంతో, అయిష్టంగా మహారాజా ఫాక్టరీకి అనుమతి యిచ్చాడు.

మొదటి ఫాక్టరీ తయారయింది. అందులో పని చెయ్యటానికి దిబ్బపౌరుడు ఒక్కడూ రాలేదు. ఎందుకు రావాలి? ఆనాటి దిబ్బలో అందరికీ ఇళ్ళున్నాయి. పని ఉన్నది. డబ్బులేదు, నిజమే. కాని డబ్బుతో ఎవరికీ నిమిత్తం కూడా లేదు. జనసామాన్యం కష్టపడి పనులు చేసుకునేవారు. వారి అత్యవసరాలు తీరేవి. కోటిరాయలు కట్టించిన రాతి గోడల ఫాక్టరీలో కూచుని పనిచేయవలసిన అవసరమేముందీ?

ఈ ఫాక్టరీకి దిబ్బ ప్రజలు 'జైలు' అని పేరు పెట్టారు. ఆ పేరు కార్చిచ్చులా పాకి, కాలక్రమాన ఖాయమైపోయింది. ఇవాళ కూడా, "జైలు ఎక్కడ?" అంటే ఎవరన్నా ఈ ఫాక్టరీనే చూపిస్తారు!

కోటిరాయలు బ్రిటిష్ ప్రాంతం నుంచి కూలీలను తెచ్చి ఫాక్టరీ నడిపాడు. వాళ్ళు అడుక్కుతినేవాళ్ళు. అలగాజనం. కూలీలుండటానికి కోటిరాయలు ఇళ్లు కట్టించాడు. వాళ్ళకోసం స్టోరు పెట్టించాడు. వాళ్ళకు కూలీకింద ఇచ్చినదంతా అద్దెకిందా, స్టోరు ద్వారా తిరిగి రాబట్టాడు.

కోటిరాయలు చాలా డబ్బు చేస్తున్నాడనే వార్త పొక్కింది. దివాన్జీ ఆయనను పిలిపించి, "ఫాక్టరీ పనికి గడువూ, గంటలూ లేవని విన్నాను. నాగరికదేశాలలో లాగ పనిగంటల నియమం ఎందుకు పాటించకూడదూ?" అన్నాడు.

"దివాన్జీ, మీకు తెలియనిదేముంది? ప్రతిపనీ తన కాల ప్రమాణాన్ని తానే నిర్ణయించుకుంటుంది. పనికి గంటలు నిర్ణయించటం ఆర్యధర్మం కాదు. శేరు బియ్యం పిండి విసరటానికి ఇంతకాలం పడుతుందనే లెక్క ఉంటుంది. వేళ అయిపోయిందని,

మధ్యలో తిరగలి వదిలిపోయిన ఇల్లాలికి ఆ పనిమీద విముఖత్వం రాదా? మీరు చెప్పే నాగరిక దేశాలలో ఇలాటి విముఖత్వం పుట్టినాకనే కార్మిక సంఘాలూ సమ్మెలూ వచ్చాయి. నేను బర్మింగ్ హాంలో ఉండగా..."

కోటిరాయలు చెప్పినదంతా విని, దివాన్జీ, "సరే, ప్రస్తుతానికి ఇలాగే కానివ్వండి. కాని ఈ విషయంలో నేను పూర్తిగా మీతో ఏకీభవించినట్టు తలచవద్దు" అన్నాడు.

ఆ నెలలోనే దివాన్జీ కుమార్తె వివాహం జరిగినప్పుడు కోటిరాయలుగారు పెళ్ళికూతురుకిచ్చిన కానుక, రత్నాలహారం, మిగిలిన అన్ని కానుకలకంటె విలువైనదని చెప్పుకున్నారు. దివాన్జీని కొనేసుకున్నానని కోటిరాయలు అనుకుంటే చాలా పొరపాటు పడ్డాడు.

మరికొంత కాలానికి దివాన్జీ మహారాజావారితో, "మనం పరిశ్రమల రాబడి పన్ను అంటూ ఏదో ఒకటి విధించాలి" అన్నాడు.

"ఏ లెక్కన విధిస్తే బాగుంటుంది?" అన్నాడు మహారాజా.

"నూటికి మూడువంతున వేద్దామనుకుంటున్నాను."

"కోటిరాయలుతో మాట్లాడి చూడండి!"

దివాన్జీ కోటిరాయలును పిలిపించి మాట్లాడాడు. కోటిరాయలు మహారాజా దగ్గిరికి వెళ్ళి, "మహారాజా, ఏమిటీ అన్యాయం?" అని అడిగాడు.

"పరిశ్రమల మీద పన్నుండటం, రివాజు కాదా?" అన్నాడు మహారాజా.

"అభివృద్ధిమీద పన్నా? నాగరికతమీద పన్నా?" అన్నాడు కోటిరాయలు ఆశ్చర్యంగా.

ఆఖరుకు నూరింట ఒకటి వంతున కోటిరాయలు లాభాలమీద పన్ను విధించారు. ఈ పన్ను తప్పించుకునేటందుకు కోటిరాయలు ఇతర ఫాక్టరీలు కట్టసాగాడు.

అయితే ఆయన అభ్యుదయానికి మరొక పెద్ద అవాంతరం వచ్చింది. ఆయన ఫాక్టరీలో పనిచేసే కూలీలు, ఈ చాకిరీయే స్వంతాన చేసుకుని ఇంతకన్న స్వేచ్ఛగా బతకవచ్చునని కనిపెట్టారు. ఎక్కడబడితే అక్కడ తాటి చెట్లున్నాయి. కొట్టుకుంటే అడిగేవాడు లేడు. ఊరంతటా ఖాళీ స్థలాలున్నాయి. ఇళ్ళువేసుకుంటే అడిగేవాడు లేడు. ఫాక్టరీలో పనిచేసే మగవాళ్ళకన్న పిళ్ళువిసిరీ, ధాన్యందంచీ, ఎవరి ఇళ్ళలోనైనా చాకిరీ చేసి డబ్బు సంపాదించే ఆడవాళ్ళపని బాగున్నది. సగం కూలికి ఫాక్టరీలో పనిచేసే పిల్లకాయలు అనారోగ్యంగా, ఎదగకుండా ఉన్నారు. ఊళ్ళో గాలికి తిరిగే పిల్లలు ఉక్కుముక్కల్లాగా వున్నారు.

కార్మికులలో కొత్త ఆలోచనలు బయలుదేరాయి. వాళ్ళు 'జైలు' ఖాళీచేసి బయట ఇళ్ళు వేసుకుని బతకసాగారు.

కోటిరాయలు మహారాజా దర్శనం చేసుకున్నాడు.

"దివాణానికి బోలెడంత సొమ్ము పన్నురూపంలో చెల్లిస్తున్నాను. కాని దివాణంవారు నా పట్ల వహించిన వైఖరి చూస్తే నేనీపరిశ్రమలు దేశం బాగుకోసం కాక, నా బాగుకోసం నడుపుతున్నాననుకుంటున్నట్టున్నది. మహారాజా, నేను ధనంతో పుట్టలేదు. పొయ్యేటప్పుడు చిల్లిగవ్వకూడా వెంట తీసుకుపోను. నా జీవితం ధారపోసి నడిపే ఈ పరిశ్రమలను రక్షించి కాపాడవలసిందని ప్రార్థించే హక్కు నాకు లేదా?" అని అడిగాడు కోటిరాయలు కళ్ళనీళ్ళ పర్యంతమై.

"మీకు ఏవిధమైన రక్షణ కావాలి?" అని అడిగాడు మహారాజా.

"పారిశ్రామిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే కొన్ని అభివృద్ధికరమైన శాసనాలు జరగాలి. నేను దివాణం అధికారిని కాను. కాని నన్ను దివానును చేస్తే, ప్రజలు ఎవరి అనుమతి లేకుండా ఎక్కడబడితే అక్కడ ఇళ్ళు వేసుకునేటందుకు అనుమతించను. అది ఆర్థిక వ్యవస్థలో అరాచకాన్ని సూచిస్తుంది" అన్నాడు.

"దివాన్జీతో మాట్లాడి చూడండి!" అన్నాడు మహారాజా.

కోటిరాయలు చెప్పిన శాసనానికి దివాన్జీ ససేమిరా సమ్మతించలేదు.

"అలాటి శాసనం చేస్తే నాకు మతిలేదనుకుంటారు. ఊరంతటా మైదానాలున్నాయి. జనం వాళ్ళ కాయకష్టంతో ఇళ్ళు కట్టుకుని నివసిస్తారు తప్పేమిటి?" అన్నాడాయన. కోటిరాయలు విచారంగా తల ఊపి వెళ్ళిపోయాడు.

తరవాత కొద్దికాలానికి దిబ్బనగరంలో అనేకచోట్ల పేదవాళ్ళ గుడిసెలు పరశురామ ప్రీతి అయాయి. మరిమూడు నెలలకు మరొక తడవ అనేక ఇళ్ళు కాలిపోయాయి.

ఇదంతా ఎవడో చేస్తున్నాడని పుకారు పుట్టింది.

ఎవడో పొడుగాటివాడుట, తలవెనక్కు తిరిగి ఉంటుందిట. ఇళ్ళు అంటించి మరుక్షణం మాయమవుతాట్ట. వాణ్ణి నలుగురైదుగురు కళ్ళారా చూశామన్నారు. అందులో ఒకడు ఈ వింతవ్యక్తి కాకిగా మారి ఎగిరిపోగా కూడా చూశాట్ట!

ఎన్ని కట్టుదిట్టాలు ఏర్పాటు చేసినా కొంపలు కాలటం ఆగలేదు. కొన్ని ఇళ్ళలో జనం కూడా చచ్చారు.

కొద్దికాలానికి దివాన్జీయే చచ్చాడు. ఆయనకు వచ్చినది పెద్ద జబ్బని ఎవరూ అనుకోలేదు. కాని ఆయన వైద్యుడు మాత్రం మొదటినుంచీ ప్రాణాపాయం అంటూనే వచ్చాడు. చికిత్స చేసినకొద్దీ రోగం విషమించింది.

దివాన్జీ పదవి కోటిరాయలుకు సంక్రమించింది.

కోటిరాయలు దివాన్జీ కాబోతాడన్న వార్త పొక్కగానే కొందరు మిత్రులు అభినందించారు. "మరలు తిప్పుకునే నాకు రాజకీయాలెందుకు?" అన్నాడాయన.

కోటిరాయలు దివాన్జీ అయాక దిబ్బరాజ్యంలో కలిగిన అభివృద్ధి అత్యాశ్చర్య కరమైనది. దిబ్బకు మొదటిసారిగా స్టేట్ రైల్వే ఏర్పడింది. విద్యుచ్ఛక్తి కేంద్రం ఏర్పడింది. సాయుధ పోలీసులు ఏర్పడ్డారు. ఇళ్ళు కట్టటానికి అనుమతులిచ్చే పద్ధతి ఏర్పడింది. మొట్టమొదటి సారిగా వీథుల్లో అడుక్కు తినేవాళ్ళూ, ప్రొలిటేరియన్లని పిలవబడే అలగాజనమూ, ఫాక్టరీ ఉత్పత్తి చేసిన వికలాంగులూ కనిపించారు.

కోటిరాయలు పరిశ్రమలు వ్యాప్తిచెందాయి. కాని ఆయన ఫాక్టరీలలో గంటలు లేవు. కోటిరాయలుకు రాబడిపన్ను లేదు. ఆయనపై పోటీగా పరిశ్రమలు స్థాపించటానికి కొందరు మార్వాడీలూ, గుజరాతీలూ యత్నించారు. కాని వారికి అనుమతి లభించలేదు. కొందరు మొండివాళ్ళు దిబ్బ పొలిమేర అవతల ఫాక్టరీలు కట్టి పరిశ్రమలు నడిపి సరుకులు దిబ్బలో పోటీధరలతో అమ్మాలని ప్రయత్నించారు. ఈ ప్రయత్నాలను భగ్నం చెయ్యటానికి కోటిరాయలు దివాణం సొమ్మునుంచి నీళ్ళలాగా ఖర్చుచేశాడు.

పారిశ్రామికుడుగా కోటిరాయలు ఏపాటి దక్షత గలవాడన్న విషయంలో అభిప్రాయ భేదాలు లేకపోలేదు. ఆయన దిబ్బ పారిశ్రామిక యువకర్త అన్నది గుర్తించి తీరాలనీ, పాశ్చాత్య దేశాలలో తొలి పారిశ్రామికులు సాధించిన విజయాలకు ఆయన విజయాలు ఏ మాత్రం తీసిపోవని కొందరు చరిత్రకారులంటారు. తనకు పోటీయేలేని తరుణంలో, ఫాక్టరీ చట్టమన్నది లేని పరిస్థితుల్లో, కార్మికుల ఐక్య ప్రతిఘటన అన్నది మచ్చుకైనా లేనప్పుడు, దోపిడీలూ, హత్యలూ, మొదలుగాగల అవాచ్యాలన్నీ చేసికూడా, పొలిమేర అవతల గల పరిశ్రమలతో పోటీ చెయ్యలేకపోయినాడు; ఆయన కూడా ఒక పారిశ్రామికుడేనా అని కొందరంటారు. ఈ రెండు విరుద్ధాభిప్రాయాల మధ్యా నిజం తేల్చటం కష్టం.

రాజకీయంగా కోటిరాయలు నికరమైన దేశభక్తుడవటానికి సందేహంలేదు. భారత స్వాతంత్ర్య పోరాటం జరిగిన కాలంలో, కాంగ్రెసు నాయకులు దిబ్బకు రావటం తటస్థించినట్టయితే వారిని వెంటనే అరెస్టు చేయించి బ్రిటిష్ పోలీసుల వశపరచి, స్వాతంత్ర్యోద్యమం అవిచ్ఛిన్నంగా సాగటానికి తోడ్పడ్డాడు. దిబ్బలో చెదురుగా సత్యాగ్రహాలు జరిగినప్పుడు సత్యాగ్రహులనూ, వారిదగ్గిర బంధువులనూ కూడా ఖైదు చేయించి, బ్రిటిష్ పెత్తందార్ల ద్వారా సంస్థాన శాంతికి భంగం కలగకుండా చూశాడు. దిబ్బలో తొలి రాష్ట్రీయ స్వయం సేవాదళం ఏర్పాటయినప్పుడు, 94 ఏళ్ళ వయస్సులో కూడా ఆయన స్వయం సేవకుల విన్యాసాలు సందర్శించి, 'దేశం యొక్క భవిష్యత్తు మీపైనే ఉన్నది' అని ఆశీర్వదించాడు.

కోటిరాయలు మరణం దిబ్బకు పెద్ద దెబ్బ. దిబ్బ పరిశ్రమలను గురించి ఈనాడు

చెప్పుకునేవాడు లేడు. కార్మిక సంఘాల ఆందోళనా హెచ్చుగా ఉంది. నానాటికి దిబ్బ రాబడి పడిపోతోంది. ఫాక్టరీ ఆక్టు దిబ్బలోకూడా అమలులోకి వచ్చింది. కోటిరాయలు వేటిని నిరోధించటానికి తన యావచ్ఛక్తులూ ధారపోశాడో అవల్లా ఈనాడు వచ్చేశాయి.

ఇటీవల దిబ్బకు వచ్చిన పాశ్చాత్య ఆర్థిక నిపుణుల బృందంతో ఒక దిబ్బ విలేఖరి మాట్లాడగా, ఒక నిపుణుడు, "మీ కోటిరాయలుకు ఆర్థిక పరిజ్ఞానం సున్నా! దిబ్బ అభివృద్ధి కావటానికి ఒకటే ఉపాయం. వీథులన్నీ దున్ని పంటలు పండించండి. అంతకన్న దిబ్బకు – ఆ మాటకు వస్తే ఆగ్నేయాసియాకు భవిష్యత్తులేదు" అన్నాడుట.

*ముద్రణ: దిబ్బరాజ్యం కథల సంపుటి, 1959*
*జయా పబ్లికేషన్స్, విజయవాడ*